# మనిషి

## శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

ఛటర్జీవద్ద సెలవుపుచ్చుకుని కలకత్తామెయిల్లో కాలుపెట్టిన దగ్గరనించీ, బాజీ నెప్పుడు చూతునా, ఎప్పుడు చూతునా అని చక్రవర్తి హృదయం తటతటలాడిపోతోంది. ఎక్కడ కలకత్తా, ఎక్కడ కోనసీమ! ఎంతదూరముందో అతనికే తెలియదు. బండి మెయిలయినా కొంచెం తాపీగా నడుస్తున్నట్టనిపించింది. అక్కడికి చేరుకునేసరికి తెల్లవారకమానదు. టైముచూస్తే రాత్రి తొమ్మిదిన్నర కాలేదింకా. ఆ కొండలూ, ఆ కాలవలూ, చెట్లూ, చేమలూ అన్నిటినీ చిమ్ముకుంటూ వెళిపోతోంది ట్రెయిను. అతని కళ్లముందు ప్రకృతి తన సౌందర్యాన్నంతా వొలకబోసుకుంటూన్నట్టనిపించింది; మరోహప్పుడైతే, ఏ ఇంజన్ చెడిపోయి రైలు ఆకస్మికంగా మధ్యలో ఆగిపోతే బాగుండు ననుకునేవాడు; కాని, ఇప్పుడు బాజీని చూడాలి.

బాజీ కిప్పుడు కొంచెం హెచ్చుతగ్గుగా మూడేళ్లు నిండవచ్చు. చిన్న పెదిమలూ, ముద్దులూరించే పాల బుగ్గలూ—అంతా తల్లి పోలికే. తన నిప్పుడు ఆనవాలు పట్టగలడో లేడో.

చక్రవర్తి జమీందారు బిడ్డ. పోతుగడ్డ జమీందారు. కాలం చెయ్యగానే, జమీవారసత్వం నిష్కారణంగా దావాలోపడింది. చక్రవర్తి రాణీ రుక్మిణీదేవికి కలిగిన బిడ్డ కాదనీ...ఆమె నీళ్లుపోసుకున్నట్టు నటించిందనీ...నెలలు నిండినట్టు లెఖ్ఖకు రాగానే ఒక దాసీపుత్రుణ్ణి సేకరించి పురిటిమంచం మీదికి తెచ్చుకున్నదనీ...ప్రత్యర్ధులు అభియోగం తెచ్చారు.

పెంచుకున్న ఉద్యోగస్తులే అటువేపునించి తరతరాల గడ్డితిని...కూటసాక్ష్యాలిచ్చి...ఆ అసత్యాన్ని సత్యమని రుజువుచేశారు. ఆ కూటంలో తనచేత మహోపకారాలు పొందివున్న విశ్వాసఘాతకుల్నీ...దివాణంలో తనకి అతి సన్నిహితంగా మసులుతూ వెనకాల గోతులుతీసిన గుంటనక్కల్నీ...ఎంతోమందిని గుర్తించాడు చక్రవర్తి.

జమీ పోయినందుకు చక్రవర్తి అంతగా చలించలేదు. అతనికి ఉదాత్తమయిన కళాహృదయ ముంది. చక్రవర్తి ఆంధ్రదేశంలో సుప్రసిద్ధ చిత్రకారుడు. చిత్రలేఖనంలో అతనిది మెలిదిరిగినచెయ్యి. ఆమధ్య అలహాబాదులో జరిగిన అఖిలభారత చిత్రకళా ప్రదర్శనంలో అతని 'కారుమబ్బులు'అన్న చిత్రం చూచినవాళ్లు హాలులో కించిత్తు చలి కూడా వేసిందని అతిశయోక్తిగా చెప్పుకున్నారు.

కాని, జమీపోయిన సంఘటన అతని మనస్తత్వాన్నే వక్రంగా మెలితిప్పింది. మనిషిమీద నమ్మకం పోయిందతనికి. వాస్తవానికి చక్రవర్తికి ప్రసక్తమయిన మానవప్రపంచం బహుసంకుచితమయినది. ఆ చిన్నఆవరణలో అతనికి తారసిల్లిన వ్యక్తు లందరూ కుత్సితులూ, దుర్జనులూ అయినారు. వాళ్లని కొలబద్దగా చేసుకుని అసలు మానవతనే శంకించే దుర్గతికి వచ్చాడు చక్రవర్తి. దానాదీనా, మనిషిఅన్నవాణ్ని అనుమానించకుండా వుండలేక పోయాడు చక్రవర్తి. వాళ్ల చూపులలో, మాటలలో కటుత్వమూ, కశ్మలమూ వూహించుకుని వైదొలగి పోతూవచ్చాడు.

అసలు నిఖార్సయిన ప్రజల్ని...రక్తమాంసా

అన్నాళ్ళూ జమీందారు ఉప్పుతిని కండలు బలిసిన ప్రజల్ని...అమాయికత్వంలో మాలపడి

పోయివున్న ప్రజల్ని...చెమటోడ్చి, నెత్తురోడ్చి, దివాణంలో నడిచే కుట్రలకీ కుహకాలకీ దూరంగా... తన దివాణానికి అంగరంగవైభవాలు సమకూర్చుతున్న ప్రజల్ని...చక్రవర్తి ఎన్నడూ చూడనేలేదు. ప్రపంచంలో దరిద్ర మెంతవున్నదో, ఎంతమంది బ్రతుకే ఒక శాపంగా......ఒక శిక్షగా అనుభవిస్తున్నారో, అతని వూహాకందని వృత్తాంతం !

దావాలో నెగ్గినా ప్రత్యర్థు లతన్ని వదలలేదు. శత్రుశేషం ఉండగూడదన్న రాజనీతి ననుసరించి... ఆ దుర్మార్గులు...యువరాణీ ఉమాదేవి చుట్టూ చేరి... చక్రవర్తిని వదిలిపెట్టిపొమ్మని హితబోధ చేశారు. అతని ఆభిజాత్యం నీచమయిందిఅని వర్ణించారు. 'నీవు ఉత్తమకులసంజాతవు'అని అగ్గించారు. ఆ దుర్బోధ లేవీ ఆమె చెవికెక్కలేదు. 'కడజాతివాడుకానీ. చక్రవర్తి నా భర్త—నా ఆరాధ్య దైవం'అని నిశ్చలంగా సమాధానమిచ్చి వాళ్ల నోళ్లు కట్టేసింది యువరాణీ. ఆ తరవాతనయినా ప్రత్యర్థులు తమ పన్నాగాలు విరమించుకోలేదు. ఉమాదేవిని ఒక కళంకినిగా...ఒక పతితగా...చిత్రించి లేనిపోని అభాండాలు ఆమె నెత్తిన వేసి, చక్రవర్తి మనస్సు విరుద్ధమని శతథా ప్రయత్నించారు.

ఉమాదేవి దుఃఖానికి మేరలేకపోయింది. ఎప్పుడు చూచినా శోకదేవతలా అగుపిస్తూ వచ్చిందామె. 'నేను లోకులకీ ... పలుగాకులకీ...జడవను... నిన్ను గూర్చి చెలరేగుతున్న విషప్రచారాన్ని నేను నమ్మను. నీ హృదయం నాకు తెలుసు' అని భరోసా ఇస్తూనే వున్నాడు చక్రవర్తి.

కాని ఉమాదేవికి విరక్తి కల్గింది. ప్రత్యర్థుల కళ్లు చల్లగా...ఒకానొక శుభోదయాన ... ఆమె ఆత్మహత్య చేసుకున్నది. ఇంత కసి చక్రవర్తి మీద పెరిగిపోవటానికి కారణం ... చిత్రమనిపించవచ్చును. అది యిదీ...అతని మంచితనం, అతని నిర్లిప్తత... అశక్తత...ఎప్పుడూ బొమ్మలుగీరికే వ్యాసంగంలో మునిగివుండడంలో పైకి కనిపించే అతని అలసత్వం... ఒకళ్ల దురాగతాలని సహించి వూరుకునే క్షమాగుణం...తనకి నిర్హేతుకంగా అపకారం తలపెట్టిన దుర్మార్గుల్ని రాచిరంపాన పెట్టాలన్న ప్రతీకారవాంఛ యత్కించిత్తూ...లేకపోవడం...ఒక్కమాటలో తనని తాను సంరక్షించుకోలేని దౌర్బల్యం

ఒక్కొక్కసారి చేతగానితనం ఘనీభవించిన చోట...ఆ అలుసు చూచుకొని దుర్మార్గులు పెచ్చరిల్లిపోతారు. వాళ్ల దుర్మార్గానికి......ఆ మధ్య స్తబ్ధంగా...అచంచలంగా పడివున్న నీరసపదార్థమే కారణమూ అనిపిస్తుందికూడా. అందుచేత క్షమాగుణం సర్వేసర్వత్రా సుగుణమేఅని చెప్పుకుందుకులేదు. ఒక సందర్భంలో అది దుర్జనత్వానికి ప్రేరణగా పరిణమిస్తుంది. అప్పుడు దానిని దుర్గుణాల జాబితాలో చేర్చవలసివస్తుంది.

చక్రవర్తి ప్రతిజ్ఞ చేసుకున్నాడా అనిపిస్తుంది.. నా చిత్రాలలోనుండి మనిషి పురుగు కనిపించగూడదు అనుకున్నాడు. అతని మనస్తత్వాని కనుగుణంగానే అతని చిత్రాలలో... కొండా, కోనా, ...చెట్టూ చేమా... అరణ్యమూ...ఆకాశమూ... ఇవే సాక్షాత్కరిస్తాయి. అన్నీ ప్రకృతి చిత్రాలే. ప్రకృతిలోని ప్రశాంతతా.. గాంభీర్యమూ...సౌందర్యమూ సౌకుమార్యమూ అన్ని కోణాలలోనించీ అతని కుంచె అందిపుచ్చుకున్నది. ఆ చిత్రాలలో మానవుడన్నవాడుమాత్రం కనిపించడు.

రెండోపెళ్లి అతనికి కిట్టదు. అతని మతానికే వ్యతిరేకం.

తల్లి పోయినప్పుడు బాజీ రెండునెలల పసిగుడ్డు. అప్పటినించీ రాజోలుదగ్గర ఒక చిన్న పల్లెటూర్లో అమ్మమ్మగారి ఇంటివద్ద పెరుగుతున్నాడు, వాళ్లూ కలవాళ్లేను.

చక్రవర్తీ ఛటర్జీ ప్రాణమిత్రులు. భార్య పోగానే చక్రవర్తి మనస్సు వికలమయిందని ఛటర్జీ గమనించాడు. తక్షణం కలకత్తాకి రమ్మనమని, అక్కణ్ణించీ యూరప్ ప్రయాణం కట్టాడు. విదేశీ చిత్రకళ కొంత స్టడీచేసివద్దామని వంకపెట్టి అతణ్ణి మరిపింపడానికని జపాన్, ఫ్రాన్స్ మొదలైన దేశాలు

కొన్నిటినిమాత్రం పర్యటన చేయించి స్వదేశానికి మళ్ళించాడు.

ఎక్కడ చూచినా చిత్రకళలో మానవుడికీ, మానవతకీ పట్టంకట్టడం జరుగుతోంది. వీళ్ళందరికీ ఈ మనిషి పురుగులో పేరుకున్న కుళ్ళు గ్రాహ్యం కాలేదా? పశుపక్ష్యాదులలోనూ, మనం 'జడజగత్తు' అని ఈసడించుకునే ఈ స్థావరజగత్తులోనూ, మచ్చుకైనా దొరకనిదీ...కేవలం మృగ్యమై వున్నదీ అయిన ఒకానొక పదార్థం పనిగట్టుకొని సృష్టించుకున్నాడు మానవుడు. అదే పాపం! ఈ జడప్రకృతి మానవతకన్న వేయిరెట్లు ఆరాధ్యమయినదికాదా? ఇట్లా సాగింది అతని ఆలోచనా స్రవంతి. దేశం తిరిగినా, దేశాంతరాలు పర్యటించినా, అతని చిత్రాలలో మానవాంశ చోటు చేసుకోలేకపోయింది.

రాజోలులో పడవదిగి, పొలాల గట్లమ్మట సూట్‌కేస్ పుచ్చుకుని బయల్దేరాడు చక్రవర్తి. చల్లనిపిల్లగాలికి పైరంతా కెరటాలు కెరటాలుగా బంగారుతూగుటుయ్యాల లూగుతోంది. కంకులు గలగలమని వొరిగిపోతూ అల్లరిపిల్లకాయల గుంపులా మిడిసిపడిపోతున్నాయి. ఆ వైపున గుబురుగావున్న తోటల్లోంచి కొబ్బరిచెట్లు సంధ్యారాగంలో తడిసిన చేతులెత్తి రారమ్మని పిలుస్తున్నాయి. దూరాన్ని పంపరపనాసచెట్ల నీడలలోనించి పెంకుటిల్లొకటి తొంగిచూస్తోంది. లోపలికివెళ్ళాడు చక్రవర్తి. ఇంటి ముందు పపాటామొక్కకి కట్టివుంచారొక దూడ పెయ్యని. దాన్ని చల్‌చల్‌మంటూ ఒక కొబ్బరాకుతో అదలిస్తున్నాడు తప్పటడుగులువేస్తున్న పసిపిల్లడొకడు. ఆ లేతబుగ్గలూ, నొక్కులవెంట్రుకలూ— గుర్తుపట్టటానికి ఒక్కగడియపట్టలేదు చక్రవర్తికి. తక్షణంవెళ్ళి చేతుల్లోకి తీసుకుని గట్టిగా అదుముకున్నాడు. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. ఈ ప్రపంచంలో తనకి మిగిలివున్న సుఖశాంతులన్నీ వొక్కపొదిగా వొల్లుకుని గుప్పిట్లోకి తీసుకున్నట్టనిపించింది చక్రవర్తికి.

విశాఖపట్నంలో సముద్రపు వొడ్డున సొంత మేడలో మకాం పెట్టాడు చక్రవర్తి. రాగానే బజారుకి తీసికెళ్ళి బాజీకీ కీచుకీచు పిట్టలూ, కీయిచ్చి వదిలేస్తే నడిచే మోటారు బళ్ళూ, గౌన్లువేసిన సెలిలాయిడ్ బొమ్మలూ, వో రెండు డజన్లుకొని ఇంటికి చేర్చాడు. బాజీ కిదంతా భంగారుగా వుంది. ఆ రంగు రంగుల పటాలూ, ఎలక్ట్రిక్ దీపాలూ, పువ్వుల గుడ్డతెరలూ మధ్యంలో జింకపిల్లలాగ అలాగే నిలబడి తేరిచూశాడు గంటల తరబడి. ఈ గలభాలో, జీడిమామిడి పళ్ల వాసనా, తువ్వాయి చిందులూ, అమ్మమ్మ లాలనా అన్నీ మర్చిపోయాడు. ఆటబొమ్మలలో పగలగొట్టటానికి వీలుగావుండే వేమయినా వున్నాయేమోనని ఒకసారి అన్నిటినీ గచ్చు మీదకొట్టి చూచాడు. కొన్ని పగిలినై. తరవాత అందినంతవరకూ, గోడలకున్న పటాలు వేళ్ళతో పట్టుకుని లాగిచూచాడు. కొన్ని చినిగినై. ఏమీ తోచక, కుర్చీ, స్తంభాలూ, అన్నీ వొకసారి వొదులుగా వున్నాయో లేదో అని వూపి చూచాడు. ఆఖరికి ఎత్తుకునే పిల్లని మెల్లిగా మరిపించి, రెండు మూడు అద్దాలూ, ఒక లాంతరు చిమ్నీ పగలగొట్టి బొమ్మల పుస్తక మొకటి కసిదీరా అయిదారు పేజీలు చింపిన తరువాత కొంచెం శాంతించాడు.

చక్రవర్తి యథాప్రకారం చిత్రలేఖనం సాగించాడు. మనిషి వాసనంటే కిట్టదు. సాధారణంగా ఎవ్వరితోనూ ఏ ప్రమేయమూ పెట్టుకోడు. చిత్రాలలో ఎప్పటిలా, 'నీ రెండనీ' 'వాన వెలిసిన మబ్బులనీ', 'కాలవ వంపునీ' రమణీయంగా కేన్వాసుమీద చిత్రిస్తున్నాడు. సాయంత్రం అందరూ బీచికి వెడుతుంటే, అతను టవునుకి నాలుగైదు మైళ్లదూరం నడిచి పంటకాలవ మలుపులోనూ, కొండల ప్రక్కని, చెరుకు మళ్ల జీబులోనూ నడుస్తూ వచ్చాడు........

మారుతున్న ఈ ప్రపంచంలో మారని చక్రవర్తికి ముఖ్యంగా రాజకీయాలంటే తలనొప్పి. అప్పుడు గాంధీ మహాత్ముని హరిజనోద్యమం మాంచి తీవ్రంగావున్నరోజులు. గాంధీటోపీ పెట్టుకుని

ఒకాయన వొచ్చిచెప్పాడు. హరిజనోద్ధరణకి పూనుకుంటేనేగాని హిందూజాతికి స్వరాజ్యసిద్ధి—లేదనీ, ఇన్నాళ్ళూ వాళ్ళని అధోగతిపాలు చేసినందుకు మనం ప్రాయశ్చిత్తం చేసుకోవాలనీ, ఏమేమో ఏకరువు పెట్టాడు. ఏమిటో అగమ్యగోచరంగా వున్నది చక్రవర్తికి. అర్థంచేసుకునేందుకు ప్రయత్నించలేదు కూడా. ఏతావాతా ఆయన చెప్పొచ్చిందేమిటంటే, 'ప్రతిగృహస్థూ వొక హరిజనబాలుడికి ఆశ్రయమిచ్చి వాణ్ణి అభివృద్ధికి తీసుకురావాలి' అన్నాడు. ఇది మహాత్ముని ఆదేశమని తేల్చాడు. మనం నలుగురమూ నడుం కడితేనేగాని సంఘం బాగుపడదన్నాడు. చక్రవర్తి తల వూపాడు. ఇప్పటికే, వంటకొక మనిషీ, బాజీ నెత్తుకునేందుకొకపిల్లా, స్టూడియోలో కొక కుర్రాడూ, వద్దంటున్నా ఒక చిన్నిసంసారం వలసన్నిం డతనిచుట్టూ. కాని, వొచ్చినాయన పేరున్న పెద్దమనిషి. మొహమాటానికి సరేనని వొప్పుకున్నాడు.

ప్రొద్దుపొడవగానే వొచ్చినుంచున్నా డొహ కుర్రాడు.

'నీ పేరేమిట్రా?'

'గోవిందు, బాబయ్యా'

చూశాడు...చిరిగిన షెడ్డీ, అతుకులచొక్కా, చింపిరిజుట్టూ —

'అసహ్యంగా వున్నావు పో' అన్నాడు.

గోవిందు తల్లి కొక్కడే కొడుకు. రెక్కాడితేనేగాని డొక్కాడని సంసారం. కళ్ళేనా కనపడని వృద్ధాప్యంలో కోతలకనీ, ఊడుపులకనీ వెళ్ళలేక మానుకుంది. ఇప్పుడే కొంచెం చేతికందొచ్చాడు గోవిందు. వాడేమైనా నాలుగురాళ్ళు తెస్తేకద్దు, లేకపోతే పస్తు. ఈ గర్భదరిద్రంలో శుభ్రమైన బట్టలూ, నాజూకయిన మొహమూ ఎక్కణ్ణించి వస్తాయి వాడికి? కొళాయిదగ్గర బట్టలు పులుముకుని, కొంచెం తెలుపుజేసుకుని, సాయంత్రం మళ్ళీ వక్కావచ్చాడు గోవిందు. పొద్దుటూ, మధ్యాహ్నమూ హరిజనపాఠశాలకి వెళ్ళివస్తున్నాడు. మూడు పూటలా చక్రవర్తి ఇంటో భోజనం చేస్తున్నాడు. పాఠాలు చదువుకుంటూ, పగలు పిల్లకి సాయంగావుంటూ, రాత్రి పిల్లణ్ణి కనిపెట్టుకొని వుంటున్నాడు. ఎప్పుడైనా వారానికొకసారిమాత్రం తల్లిని చూడడానికి మాలపల్లివెళ్ళి వొచ్చేస్తున్నాడు. పైఖర్చుకని నెలకి నాలుగురూపాయ లిస్తున్నాడు చక్రవర్తి.

సాధారణంగా స్టూడియోలో వున్నప్పుడు చక్రవర్తి దీర్ఘాలోచనలో మునిగివుంటాడు. చూపులు, కనిపించని ఏ సౌందర్యాన్నో వెతుక్కుంటూవుంటాయి. ఆ సమయంలో ఎవరూ స్టూడియోలో కాలుపెట్టటానికి సాహసించరు. ఆ యింటో బాజీకెంత స్వాతంత్ర్యమున్నా స్టూడియోదరినైనా రావటానికిగాని, ఆ చాయల అల్లరి చేయటానికిగాని జంకుతాడు. అప్పుడప్పుడు మాత్రం వెనకాల స్టూడియో గుమ్మాన వేళ్ళాడుతున్న గుడ్డతెర వొత్తిగించి తొంగిచూస్తాడు బాజీ. అప్పుడు చేతిలోవున్న కుంచె స్టాండుమీద వుంచి, ముక్కుమీద వేలుపెట్టుకుని 'అప్పు' అంటాడు చక్రవర్తి. తుర్రుమని పావురాయిలా పలాయనం చిత్తగిస్తాడు బాజీ. క్రమక్రమంగా స్టూడియోలో వున్నప్పుడు, బాజీ తొంగిచూస్తున్నాడేమోనని ఎదురు చూడటం మలవాటయి పోయింది చక్రవర్తికి. బాజీ తొంగిచూచే వరకూ, అతని ఆలోచన ముందుకి సాగినా వెనక చూపుతోనే నడవడం ప్రారంభించింది. పగలెంత శ్రమించినా, గతచరిత్ర ఎంత కలత పెట్టినా, రాత్రి నిద్రపోయేముందు, స్టూడియో మూసి, దోమతెరలో పడుకున్న బాజీ కళ్ళు ఒక్కసారి ముద్దుపెట్టుకుంటే, అలిసిపోయిన అతని హృదయానికి ఆరోగ్యస్నానమైనట్టుండేది.

గోవిందు రాగానే బాజీ నెత్తుకునే పిల్లని తీసేశాడు చక్రవర్తి. ఇంటి పని చెయ్యటానికని వాణ్ణి వుద్దేశించకపోయినా, దయాధర్మభిక్షకింద వాడికి సాదరుకింద నెలకి నాలుగు రూపాయలిచ్చి, అప్పనంగా చదువు సంధ్యలు చెప్పించి మూడ్పొద్దులా తిండిపెట్టి మేపడమంటే అతనికి మనస్కరించ

లేదు. ఎప్పుడు చూచినా చదువుకుంటూ వుండే వాడు గోవిందు. చిమచిమలాడేది చక్రవర్తికి లోపల. వాడు చదువుకుంటూ వున్నప్పుడల్లా, బజారు పనులూ; టేబిలుమీద దుమ్ము ఎక్కువగా వున్న సంగతి, కిటికీల గుడ్డతెరలు దింపవలసిన అవసరమూ, బలీయంగా కనిపిస్తూ వుండేవి చక్రవర్తికి. పుస్తకంలో ఆనవాలు పెట్టుకుని లేచివచ్చే లోపుగానే కేకలేసేవాడు.

కోపాన్ని చూపించడానికి వీలులేని వాళ్ళకి దానిని చిరాకుకింద మార్చుకోవలసిన అవసర మొచ్చి పడుతుంది. చదువూ గిదువూ కట్టిపెట్టమని చెపితే సరిపోను, కాని; వాణ్ణి ఇక్కడ వుంచిందే అందుకోసమాయె. పోనీ ఏంటుకొచ్చిన బెడద, నిర్మొహమాటంగా వాణ్ణి వెళ్ళగొడదామా అంటే పరువూ ప్రతిష్ఠా పోతాయి. మొన్న వొచ్చిన పెద్దమనిషీ దేశభక్తుల లిస్టులో తన పేరుండటం, ఇవన్నీ జ్ఞాపకానికొచ్చాయి. అందుచేత అతని మనస్సు అతనికి తెలీకుండానే, చిరాకు పడవలసిన కారణాలకీ, కసురుకోవలసిన ఘట్టాలకీ వెతుక్కుంటోంది.

గోవిందుకీ బాజీకీ ఆటలాడుకునే వయస్సయిన మూలాన్నో, మూడోవాడి ప్రసక్తి లేకనో, ఒకళ్ళ అవసరం ఒకళ్ళకి బాగా అర్థమయివుంటుంది. ఆసరాకి దగ్గరగా మరేదీ దొరకక ఒకదాని నొకటి పెనవేసుకునే పూలతీగల్లాగే ఆ రెండు లేతహృదయాలూ పెనవేసుకున్నాయి. క్రమేణా ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంత మమకారం, వాళ్ళిద్దరి మధ్యా గాఢంగా అల్లుకుంది. పసివయస్సులో ఆత్మీయతకి బీజమంటూ పడడం తరువాయి, ఇట్టే నాటుకుని మొలకెత్తి మారాకు వేస్తుంది. చక్రవర్తి ఇదంతా గమనిస్తూనేవున్నాడు. గోవిందు కడజాతివాడనే మీమాంస చక్రవర్తికెప్పుడూ అంతర్గతంగా వుండనేవుంది. దానికితోడు బంగారుకణికలా అన్నట్టు మిసమిసలు చిమ్మే బాజీవేళ్ళు మబ్బులో మెరుపుల్లా గోవిందు నల్లనిబుజాలమీదా, అంతకంటే నల్లని ఆ జుంజారు వెంట్రుకలలోనూ, జిలిబిలిగా అగుపించినప్పుడల్లా, అతనిలో ఇంకా చావకుండా మిగిలివున్న జమిందారీ నెత్తురు గిలగిలకొట్టుకోవడం ప్రారంభించింది. వినే సంగీతంలో అపస్వర మొచ్చిందని తెలియకపోయినా సున్నితమైన చెవులకి కటువుగా వినిపించక మానదు. అలాగే, ఈ కలయికలోవున్న వైపరీత్యం హేతువాదానికి నిలబడకపోయినా, అతని మనస్సుకిమాత్రం అది అసందర్భంగా, అసంగతంగా వెగటు పుట్టించింది. ఇది తుచ్ఛమైన స్వాభిమానమనీ, దాన్ని పరిహరించుకోవాలనీ, గట్టిప్రయత్నమే చేశాడు. కాని; సంకుచితమైన దురాలోచనలు లోలోపల కుట్ర చేస్తూనే వున్నాయి.

ఒకనాడు గోవిందు హాలులో కిటికీదగ్గర చదువుకుంటున్నాడు. బయట ఆ దారినే సినిమాపేపర్ల బండొకటి వెడుతోంది. బాజాలు వినిపిస్తున్నాయి. చూడటానికి దగ్గరతోవ యేదాఅని ఆలోచించాడు బాజీ. కిటికీకి దగ్గరగానే కూచున్నాడు గోవిందు. మరో సాధనం దొరకలేదు. ఆలోచనా తదనుగుణమైన చర్యా, రెండూ ఒక్కసారే, చెట్టాపట్టాలు వేసుకుని సాగుతాయి పసితనంలో. వీలు చూసుకుని, గోవిందు బుజాలమీదకెక్కి, అక్కణ్ణించి సులువుగా కిటికీ వూచలందుకున్నాడు బాజీ. కాని, బాజాలు చూస్తున్న సంబరంలో, కాలెక్కడ ఆనిందీ గమనించలేదు. పైగా చప్పట్లు కొడుతున్నాడు. కొంచెముంటే గభీమని క్రిందపడి కాళ్ళు విరుచుకునేవాడే. అప్పుడే ఏదో పనుండి హాలులోకివస్తూ, చక్రవర్తి హఠాత్తుగా చూచిపట్టుకుని దింపాడు. క్షణమాగి చురచురమని చూశాడు గోవిందువంకా, పుస్తకాల వంకా......కిక్కురుమనకుండా పుస్తకమ్మూశాడు గోవిందు.

ఆక్కడికీ ఎప్పుడైనా చక్రవర్తి కళ్ళబడితే, పుస్తకం రహస్యంగా మూస్తూనే వున్నాడు వాడు. కాగా, ఈ మధ్య పుస్తకాలు తెరవాలిసిన అవసరమూ అంతగా కనిపించటం లేదు గోవిందుకి. చదువుకొంటూవుంటే, అదనీయిదనీ, ఎడతెరిపి లేకుండా పని తగుల్తోంది. ఇకపోతే ఖర్మంచాలక ఎప్పుడైనా

బొక్కు తెరిచాడో, బాజీ ఏ ముగ్గు బుట్టవొలక బోయ్యటమో, ఏ రంగు పులుముకోవటమో, ఏ బియ్యము విరజిమ్మటంవరకో వెళ్ళి అధమపక్షం ఏ తలుపు సందునైనా వేళ్ళుంచి కెవ్వుమంటాడు, తప్పదు. అంతవరకూ వొచ్చిందో, ఒక తట్ట పరస చివాట్లు తలవాచేటట్టు తగుల్తాయి.

చక్రవర్తి బాజీనెప్పుడూ ఒక సముద్రపు వొడ్డుకిగాని, ఒక వూరేగింపుకిగాని, ఒక వుత్సవానికిగాని తీసికువెళ్ళినపాపానపోలేదు. స్టూడియోలో కుర్రాడు స్టూడియోలోనే మునిగిపోతాడు. వంట మనిషి మెస్‌లోనే మగ్గిపోతాడు. అందుచేత, బాజీకి హాలులోవున్న వస్తువుల్తోనే పరిచయం. స్టుడియో పైవున్న పువ్వులగుడ్డతెర ఎప్పుడూ పక్కున నవ్వుతూ వుంటుంది. గోడలకున్న పటాలు మాట్లాడటానికి గొంతు సవరించుకుంటున్నట్టు, సముద్రపుగాలి కెప్పుడయినా కాస్త కదిలేవి. ఎటొచ్చి, తను పలకరిస్తే పలికీ, నవ్విస్తేనవ్వీ, జడిపిస్తే జడుసుకునీ, కొడితే ఏడిచీ, ఏడుపు నటించీ, కొద్దోగొప్పో సజీవంగా వున్నట్టు కనిపించే పదార్థం ఆ హాలులో గోవిందు వొక్కడే. అతనికీ తనకీ మధ్య ఈ పుస్తకాలూ, ఈ సిరాబుడ్లూ పేరుచుకుని కూచోవటం బాజీకి కంటగింపుగావుంది. అందుచేత వాటిమీద పట్టించాడు. అన్నిటికన్న ఈ దండయాత్రతో గోవిందు చదువూ సంధ్యా ఒక్కదెబ్బతో పురుగు నాకిపోయింది.

ఇప్పుడు చదువు సాగటంలేదని గోవిందు కేమీ బెంగలేదు. కాని మేష్టారు ఊరుకోలేదు. ఓనాడు చెప్పిచూశాడు; మర్నాడు కసురుకున్నాడు; మూడో నాడు చెయిజేసుకున్నాడు: కొన్నాళ్ళవరకూ పాఠాలు బాగా చదువుకొచ్చేవాడని తెలుసు: అందుచేత, ఇప్పుడు బద్ధకం బలిసిందని టీచరికి నిర్ధారణయిపోయింది.

పోనుపోను, ఇక్కడ ఇంటోనూ, అక్కడ బళ్ళోనూ, పలచపలచగా దెబ్బలు తినటానికి అలవాటు పడ్డాడు గోవిందు. ఈ యాతన భరించలేక ఒక్కొక్కనాడు అక్కడ పాఠాలూ, ఇక్కడ పనీ రెండూ ఎగేశేవాడు.

ఒకనాడు గోవిందు బాజీ నెత్తుకుని ఎందుకో వెక్కివెక్కిఏడుస్తున్నాడు పైకి వినపడకుండా. 'నాన్నగారు కొట్టేరా?' అని పరామర్శించాడు బాజీ. చంక దిగి, 'చిచకొత్తు లివ్వనా?' అని బెల్లించేసరికి గోవిందుకి యేడవబుద్ధికాలేదు. ఆ తియ్యనిపలుకులికి తన జీవితంలో గూడుకట్టుకున్న ఎంతవేదనయినా ఒక్క క్షణంలో విరిచేశక్తి వున్నట్టనిపించింది వాడికి. పకాలున నవ్వేశాడు.

మర్నాడు, తల్లిని చూడటానికని చింతల తోపులోంచీ మాలగూడెం వెడుతున్నాడు గోవిందు. చెట్లఆకులనీడలూ, మధ్యమధ్య వెన్నెలజాడలూ కలిసి మిలమిల లాడుతున్నాయి. వాటిని చెరిపేస్తూ దెయ్యంలాగ అతని నీడ ముందుకుసాగుతోంది. ఆకుల సందు నించీ చిన్నచిన్నపిట్టలు దాగుడుముచ్చీలాడుతున్నాయి. అవేమి చదువుకున్నాయి? ఏమిజీతం తెస్తున్నాయి? అంత కోలాహలంగా వున్నాయే! బతుకుతెరువు అంత సులభంగావుంటే! ఎవడితో చెప్పుకోగలడు తన బాధ? దుఃఖానికి సానుభూతి సగం విరుగుడు. తల్లికి అర్థంకాదు. మొన్న, 'బడిపంతులు కొట్టాడ'ని బిక్కమొహంవేసుకుని చెప్పాడు. 'పాఠాలు చదవక పోతే ఎట్టారా నాయనా?' అంది, మేష్టారు కొట్టిన మాట వొదిలేసి.

చక్రవర్తి కొడుతున్న సంగతి ఇంకా చెప్పనే లేదు తల్లికి. చెబితే, అక్కడ మానెయ్యమంటుం దేమోనని భయం. మానెయ్యాలనేవుంది, కాని బాజీని వొదిలిపెట్టివుండగలడా? ఆ చిన్నిపెదిమలమీది జిలేబీ చుట్టలూ, ఆ చంపలమీది గులాబీరేకులూ, అన్నీ వొక్కసారి పగ్గాలకిందమారి వాడి మనస్సుని వెనక్కి బలంగా లాగాయి. ఏమీ తోచలేదు.

ఆ వేళ పాఠాలు బొత్తిగా చదవలేదు గోవిందు. చదవటానికి తీరికాలేదు. బడిపంతులు బెత్తంతో చితకగొట్టాడు. ఇంటికివెళ్ళి అమ్మని కావిలించుకుని బావురుమని ఏడిచాడు. తల్లి బెంబేలు పడిపోయింది. వొంటినితేలిన దద్దుర్లు చూచి హడిలి పోయింది. బడి మానెయ్యమంది. చదివి వుద్యో

గమో; ఉద్యోగమోచేసి తనని వుద్ధరిస్తాడేమో ననుకుంది ఆ పేదరాలు. గోవిందుకి తెలుసు. ఆశలన్నీ నిరాశ చేస్తున్నానే అని అతడికీ బెంగగానే వుంది. ఆలోచించాడు. అక్కడ కొట్టినా ఇక్కడ తిట్టినా అసలు చెప్పటం మానేశాడు.

ఆనాడు మధ్యాహ్నం మూడుగంటలయింది. చక్రవర్తి స్టూడియోలో కూచున్నాడు. ఆలోచనా స్రవంతికి ఏదో ఆనకట్టపడింది. వెయ్యదలుచుకున్న చిత్ర మతని వూహా కందక తప్పించుకుంటోంది. మెదడు ఖాళీగా వున్నట్టనిపించింది. ఏమీ అని తర్కించి చూచుకున్నాడు. బాజీ రెండుమూడురోజుల నించీ స్టూడియోవంక రావటం తగ్గించాడు. ఈవేళ అసలు తొంగిచూడనేలేదు. హాలులోకివెళ్ళి పరకాయించి చూచాడు. కర్టెన్‌లోనించీ ఒక సన్నని సూర్యకిరణం గచ్చునేలమీదపడి చిన్నగుండ్రని బంగారపు బిళ్ళలా అవుపిస్తోంది. దానిని ఎలాగయినా ఏరి జేబులో వేసుకుందామని తంటాలు పడుతున్నాడు బాజీ. పక్కనే మంచుని గోవిందు పకపకమని నవ్వుతున్నాడు. చక్రవర్తి స్టూడియోలోకి వెళ్ళిపోయి క్షణమాగి మళ్ళీ వచ్చిచూచాడు పరీక్షగా. గోవిందు వీపుమీద స్వారీచేస్తున్నాడు బాజీ. తువాలు మెడకింద నించి తీసి కళ్ళెంకింద పట్టుకుని చల్‌చల్ మంటున్నాడు. 'అదేమిట్రా, చవటా'అని ఒక్క అరుపు అరిచాడు చక్రవర్తి. బాజీ పక్కున నవ్వాడు. గోవిందు వులిక్కిపడ్డాడు. ఆట కంతరాయం వచ్చి ఇద్దరూ ఇబ్బందిగా మొహంపెట్టారు. స్టూడియోలో కూచుని ఆలోచించుకున్నాడు చక్రవర్తి. తను అలా ఎందుకు కసురుకున్నాడో అతనికే అర్థంకాలేదు.

వియన్నాలో నానాదేశ చిత్రకళా ప్రదర్శన మొకటి జరగ బోతోంది. దానికొక చిత్రం పంపించాలి. భారతదేశంలో సుప్రసిద్ధులైన వివిధచిత్రకారుల్ని కలుసుకోవలసిన అవసరముంది. లాహోరూ, బొంబాయి, మరి ఇతరచోట్లకీ వెడుతూవస్తూ వున్నాడు చక్రవర్తి. ఇంటిదగ్గర నిలకడగా వుండటం లేదు. బాజీని పలకరించటానికైనా తీరిక చిక్కడం లేదు. క్రమేణా బాజీకి చక్రవర్తితో ప్రమేయమూ తగ్గిపోయింది.

ఒకనాడు, ఛటర్జీ దగ్గరకి వెడదామని చక్రవర్తి ప్రయాణమయ్యాడు. బెడ్డింగు సర్దుతూ 'బాజీ'అని పిలిచాడు. గోవిందు బాజీ నెత్తుకుని దగ్గరికొచ్చాడు. బాజీ మామూలుగా చేతులు చాపలేదు. చక్రవర్తిని గమనించనైనా గమనించలేదు. మనస్సు చివుక్కుమంది. వీళ్ళిద్దరూ కలిసి తనమీద ఏదో కుట్ర చేస్తున్నారా? గోవిందువంక అసూయగా చూచాడు చక్రవర్తి. స్టూడియోలో కూచుని నిదానంగా ఆలోచించుకున్నాడు. బాజీ తనకి దూరమైపోతున్నాడా? గుండెలో రాయిపడింది.

ప్రయాణం హఠాత్తుగా విరమించుకున్నాడు చక్రవర్తి. ఇహ ఎక్కడికీ వెళ్ళదలుచుకోలేదు. కుంచెలూ, రంగులూ, కేన్వాసుగుడ్డలూ ఒకమూల పడేసి చిత్రలేఖనంకూడా కట్టిపెట్టేడు చాలావరకు. ఎప్పుడైనా గుబులుపుట్టి బాజీ నిదురపోతున్నప్పుడు మాత్రం ఒక్కసారి స్టూడియోలోకి వెళ్ళి వచ్చేస్తున్నాడు. ఇక బాజీ ఆటపాటలలో తనుగూడా కలగజేసుకుందామని గట్టిప్రయత్నాలు చేశాడు చక్రవర్తి.

గోవిందు దూరంగా నిలబడివున్నాడు. బాజీ మొహం చిట్లించుకుని విసుగ్గా నుంచున్నాడు. తను రావటం వాళ్ళిద్దరికీ ఏదో ఆడ్డంకిగా వున్నట్టు గమనించాడు చక్రవర్తి. బాజీని చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాడు. ఎత్తుకున్న మనిషి ఎవరో కొత్తమనిషి అన్నట్టు అస్తిమితంగా చూచాడు బాజీ. చూచి చంకనించి దిగజారుతున్నాడు. 'బంగారుకొండ కదూ', అంటూ ఇంకా దగ్గరికి తీసుకున్నాడు చక్రవర్తి. గునుస్తూ చేతులతో తోసిపారేసి తుర్రుమన్నాడు బాజీ. చక్రవర్తికి బాకుతో పొడిచినట్టయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. విడిచిపెట్టి తలవంచుకుని దవడ గీరుకొంటూ దీనంగా వెళ్ళిపోయాడు స్టూడియోలోకి. బాజీ కిలకిలనవ్వుతూ గోవిందుకేసి పరిగెత్తుకుపోయాడు. ఈ అవమానం

ఈ నిరాకరణ, భరించలేకపోయాడు చక్రవర్తి. అతని జీవితంలో కొత్తగావచ్చి ప్రవహిస్తున్న అమృత వాహినులన్నీ వొక్కసారి ఇంకిపోయినట్టయింది. అతని చిత్రకళా, చిత్రకళాప్రదర్శనశాలలూ, పూల మాలలూ, కరతాళధ్వనులూ అన్నీ వెలవెలపోయాయి.

ఎన్నిసాధనాలైనా ఆలోచించాడు బాజీని తన వేపుకి తిప్పుకోవాలని; బిస్కట్లూ, చాకలెట్లూ తెచ్చి బెల్లించాడు; కొత్తకొత్త ఆటవస్తువులు చేతోపుచ్చుకుని బాజీని ఆకర్షించటానికి ప్రయత్నించాడు. లాభం లేకపోయింది. గోవిందుతోనే వాడి ప్రపంచం పరిమితమైపోయింది. వాళ్లిద్దరూ గిరిగీసుకుని కూచున్నారు; తనని బైటకు నెట్టారు ఇంచుమించు. చక్రవర్తి మనస్సు ఆరాటపడుతోంది.

ఆ రాత్రి గోవిందుని యింటికి వెళ్లిపొమ్మన్నాడు చక్రవర్తి. వంటమనిషి భోజనాలయిన తరువాత వెళ్లిపోవటం రివాజు......తానొక్కడే బాజీని పడుకోబెట్టుకుని పలకరించవచ్చును అనుకున్నాడు; వాణ్ణి ఎలాగయినా మంచిజేసుకోవాలన్న తపన ఎక్కువయింది. ఇష్టంలేకపోయినా, తప్పనిసరిగా గోవిందు వెళ్లిపోయాడు. రాత్రి రెండుజాములైపోయింది. కలత నిద్రగావుంది. ఆలోచన పరిపరివిధాల పోయింది. దూరాన్ని సముద్రం హోరుమని ఏడుస్తోంది. ఈదర గాలి కిటికీ తలుపులతో మాటిమాటికీ జగడమాడుతోంది. ఉలిక్కిపడి లేచాడు బాజీ. పక్కని గోవిందు లేడు. కెవ్వున ఏడుపు మొదలుపెట్టాడు. లేచి బాజీ నెత్తుకున్నాడు చక్రవర్తి. చేతుల్లో నిలవటం లేదు. పెంకు లెగిరి పోయేటట్టు ఏడుస్తున్నాడు. బిస్కట్లిచ్చాడు; ఏడుపు మానలేదు. పాలు పట్టించాడు; త్రాగలేదు. ఆట వస్తువులన్నీ మూల మూలల వున్నవి చేర్చి ముందు పెట్టాడు; ఏడుపు ఎక్కువయ్యింది. ఉయ్యాలలో పండుకోబెట్టి వూయించాడు; మరీ గుక్కపెట్టి ఏడుస్తున్నాడు; ఖంగారు పుట్టింది. ఇంట్లో ఎవ్వరూ లేరు; అందుచేత అదుర్దా ఎక్కువయింది. బాజీని ఓదార్చే సాధనమేమిటో తెలియటం లేదు. లోపల ఏమైనా బాధగా వుందేమో. డాక్టరు దగ్గరికి తీసికెడితే? కాని త్రోవలో, ఏడుస్తూ వుండగా, అందులోనూ, ఆ నిశరాత్రివేళ ఎలా? ఇంత చలిగాలిలో కుర్రాణ్ణి ఎందుకు తీసుకొచ్చావయ్యా అంటే డాక్టరు? తీసికెళ్లకపోతే, ఏమని చెబుతాడు; డాక్టరుతో? పిల్లవాడేడీ అంటే? పోనీ డాక్టర్నే తీసుకొస్తే సరీ అనుకున్నాడు కొసకి. కాని ఎవరు పిలుచుకొస్తారు? బాజీని ఒంటరిగా ఇంట్లో వొదిలి వెళ్లటమెలా? ఏమీ తోచలేదు. మెదడు పని చెయ్యటం మానుకుంది.

ఏమనుకున్నాడో, బాజీ నెత్తుకుని స్టూడియోలోకివెళ్లి స్విచ్ వేశాడు చక్రవర్తి. గోడకి తగిలించి వున్న వొక పెద్దపటం చూపించి తెర యెత్తాడు. అది ఉమాదేవి ఛాయా చిత్రం. ఎప్పుడోగాని ఆ తెర ఎత్తడు. నిదరబోయిన తన గతకాలపు ప్రణయ జీవితమంతా వొక్కసారి కలుకుమన్నది చక్రవర్తి హృదయంలో. బాజీ రెప్ప వాల్చకుండా ఆ చిత్రం వంక వొక్క క్షణం చూచాడు. ఆవలింత లొచ్చాయి. బుజాలమీద అలాగే సోలి నిద్రపోయాడు. తెలతెల వారుతూండగా లేచి దోమతెర వొత్తిగించి చూచాడు చక్రవర్తి. రాత్రి కన్నీటి చారలు ఆ గులాబీ బుగ్గల మీద అలాగే వుండిపోయాయి. వాడిన కలవ పువ్వులా వుంది వొడలంతా. తల నిమిరి ఆ చిట్టిచేతులు తన మెడచుట్టూ వేసుకున్నాడు.

తన బాజీకీ, తన కన్నబిడ్డకే తానక్కరలేదు! ఈ చిన్నని కడుపు కోతకి అతని రక్తంలో వున్న ప్రతి బిందువూ గిలగిల కొట్టుకుంది. హృదయ కోశాన్ని ఎవరో పెకలిస్తున్నట్టు బాధపడ్డాడు చక్రవర్తి. భౌతికంగా తన చేతులలో ఇమిడినా... తన హృదయం విప్పిన రెక్కలకింద ఇమడక తప్పించుకుంటున్న ఈ ముగ్ధ సౌందర్యాన్ని మళ్లా తనది అని ధైర్యంగా చెప్పుకోగలడా ఏ నాటికైనా? తను చేసిన అపరాధమేమిటో ఎంత తిరిచి చూచుకున్నా అతని కర్థం కాలేదు. తన వునికి బొమ్మల ప్రపంచమయితే...వాడికి మనుష్యలోకం కావలసి వచ్చిందా?

హృదయానికి దగ్గరగా ఇంకా దగ్గరగా అదుముకున్నాడు బాజీని. గుండెలో మంట చల్లారలేదు. అతని కళాభిరుచులూ, కీర్తికాంక్షలూ, జీవితాశయాలూ...అన్నీ తమ తమ పనులు మానుకుని... ఒక్కసారిగా గుమికూడి...బాజీ ప్రేమభిక్షకోసమని చేతులు చాపాయి. అసలు ఈ యాతనని అర్థం చేసుకోగలిగితే బాజీ తనకి దూరమయ్యేవాడు కాడేమో. బొట-బొట కారిన కన్నీటి బొట్లు బాజీ నొసట చిందులు త్రొక్కుతున్న ఉంగరాల వెంట్రుకల మీద పడి గ్రాగిసలాడాయి. కిటికీలోనించి చిక్కని నీరెండ బాజీ చెంపలమీదపడి వెక్కిరించింది.

రోజులు గడిచాయి. ఒకనాడు గోవిందు తల్లిని చూచేందుకని వెళ్ళాడు గూడెం. రెండు రోజులుండి రమ్మన్నాడు చక్రవర్తి. వాడు చాలా పొద్దెక్కి లేచాడు. మాలగూడెంనించి స్కూలుకి వెళ్ళేసరికి, మరీ పొద్దెక్కింది. నిన్నటి పాఠాలేమీ రాలేదు. ఆ లెఖ్ఖల అంకెలూ, హిస్టరీలో తారీఖులూ అన్నీ అలుముకుపోయి, వాడి మెదట్లో మసక చీకట్లో మంచుతెరలా కమ్ముకున్నట్టుంది. పైగా బడికి ఆలస్యంగా వెళ్ళట మొకటి. వెడదామా వొద్దా అని గుంజాటనలో పడ్డాడు. మరీ ఆలస్యమయిపోయింది. ఎటొచ్చీ, ఇప్పుడు వెళ్ళినా; అసలీ వేళ ఎగవేసినా, రెండూ వొకటే. దేహశుద్ధి తప్పదు. ఇకపోతే, ఇప్పుడు చక్రవర్తి ఇంటికిగాని వెళ్ళాడా, స్కూలు ఎగవేసినట్టు తెలిసిపోతుంది; వీపు చిట్లుతుంది. గడ్డిమేటిపక్కని దూదూబిళ్ళ ఆడుకుంటున్నారిద్దరు పిల్లలు. పిల్లిపిసరకాయలు కోసుకుందామా అన్నాడు వాళ్ళతో. సరేనంటే సరే ననుకున్నారు. చక్రవర్తి ఏ వూరైనా వెళ్ళిపోయి, స్కూళ్ళన్నీ వొక్కసారి మూశేస్తే నిర్విచారంగా వుండొచ్చు ననిపించింది వాడికి. దొరికిందే సందని ఆటల్లో మునిగిపోయాడు. కాలం గడచిపోతున్న జాడేలేదు. మధ్యాహ్నం అన్నం తినలేదు. నకనకలాడుతోంది లోపల. పొద్దుగూకింది. మళ్ళీ తెల్లవారితేనే గాని బాజీ కనపడడు. ఆ పాపడిమీద బెంగపారింది. ఏదీకానివేళ ఇప్పుడుగాని చక్రవర్తి కళ్ళపడితే చర్మ మొలుస్తాడు. రెండురోజులుపోయిగాని రావద్దన్నాడు తనని. ఆలోచించాడు. ఒక వుపాయం తట్టింది. వెనకాల ప్రహరీ గోడమీదనించీ లోపలికిదూకి బాజీని పలకరించి వొచ్చేస్తే సరి. వెళ్ళాడు. ఆ మసక చీకట్లో పిట్టగోడ ఎక్కి 'బాజీ' అని పిలిచాడు. లోపల నిశ్శబ్దం. కిందకి దూకి, మునివేళ్ళమీద నడుస్తూ, హాలులోకి వెళ్ళాడు. ఎల్క్ట్రిక్ దీపం వెలుతురులోనించీ బాజీ కిలకిలలాడుతూ వాళ్ళో కొచ్చి, ఎగబడే సముద్రపు కెరటంలాగ చంకకి దూకాడు. లోపలనించీ చక్రవర్తి హఠాత్తుగా దూసుకొచ్చి చెళ్ళున లెంపకాయ కొట్టాడు. బాజీ పిల్లిలా ముడుచుకుపోయాడు. బెదురుతో గబగబా స్టూడియోలోకి పరుగు పరుగున వెళ్ళి నక్కాడు. గోవిందుకి తల గిర్రున తిరిగింది; భయోద్రేకంచేతగావును తెలివి తప్పలేదు; కళ్ళు బయర్లుగమ్మినై; లేచి గిరుక్కున వీధిలోకి పారిపోయాడు. బాజీకి భయంవేసింది. ఇన్నాళ్ళూ చక్రవర్తితో చనువుగా వుండలేకపోయినా, ఆయనంటే భయపడవలసిన ఘట్టం ఇంతవరకూ రాలేదు. స్టూడియోలోకొచ్చి బాజీని చేతుల్లోకి తీసుకున్నాడు చక్రవర్తి. పులిపంజాలో దద్దరిల్లే జింకపిల్లలా వొణికిపోయాడు బాజీ. అపరిమితమైన దుడుకుగా వుంది వాడి లేతగుండెలో. సముదాయించలేకపోయాడు చక్రవర్తి. చాలా తొందరపడ్డాననుకున్నాడు. అప్పుడు జ్ఞప్తికి వచ్చింది......అంతవరకూ తను గోవిందునెప్పుడూ బాజీ సమక్షంలో కొట్టిందిలేదు.

రాత్రివేళ, గోవిందు తిన్నగా గూడెంలో తల్లి ఇంటికి వెడుతున్నాడు. మర్రితొర్రలోంచి ఒక గుడ్లగూబ వికారంగాకూస్తూ లేచిపోయింది. పక్కని కంచెలోనించి ఒక జెర్రిపోతు జర్రున పాకిపోయింది ముందునించి. గోవిందు జడుసుకున్నాడు. చరచరా నడిచాడు. ఇంటికివెళ్ళి మొహమ్మీదకి దుప్పటి లాక్కుని నులకమంచంమీద పడుకున్నాడు. గుండెల్లో ఝల్లు ఇంకా వదలలేదు. తల్లివొచ్చి మీద చెయివేసి

చూచింది. వొళ్ళు కాలిపోతోంది. జ్వరం మాంచి తీవ్రంగావుంది.

గోవిందుకి జ్వరం తగ్గిందీ లేనిదీ చక్రవర్తికి తెలియలేదు.

పదిరోజులు పోయింతరువాత రమ్మనమని కబురుపెట్టాడు. గోవిందుతల్లి పంపనంది. చక్రవర్తి కేమీ పాలుపోలేదు. ఒకళ్లని ప్రాధేయపడటం అతని చాతకాదు.

చక్రవర్తికి మరో బెడద వచ్చిపడింది. బాజీ నానాటికీ మందకొడిగా వుంటున్నాడు. అదేమో, ఆట పాటలు క్రమేణా మానేశాడు. వొంటరితనం ఫీల్ అవుతున్నట్టు స్పష్టమయింది చక్రవర్తికి. రాత్రిళ్లు బొత్తిగా పట్టుకోలేకపోతున్నాడువాణ్ణి. పగ లెప్పుడైనా ఆడుకుంటున్నప్పుడు తను కనపడ్డాడా, తక్షణం ఆటవస్తువులన్నీ వొదిలేసి బెదిరిన లేడి పిల్లలా పారిపోతాడు. ఎక్కడో నక్కినక్కి భయం భయంగా చూస్తాడు. గోవిందుని కొట్టిన రాక్షసుడు తను! తానంటే అసహ్యమూ, భయమూ, ఆ పసివాని హృదయంలో కమ్ముకునిపోతున్నాయని కొన్నాళ్లకి గుర్తించగలిగాడు చక్రవర్తి.

ఎత్తుకోటానికి మళ్లీ ఒక పిల్లని కుదిర్చాడు చక్రవర్తి. దానిదగ్గరా మాలిమికాలేదు బాజీకి. చక్రవర్తి కర్థమయింది. వాడికి గోవిందు కావాలి.

ఆఖరికి కర్తవ్య మాలోచించి వొక నిశ్చయానికి వొచ్చాడు చక్రవర్తి. బాజీకి సరియైన సంరక్షణా పోషణాలేక చిక్కి శల్యమైపోతున్నాడు.

చివరికి ఒకనాడు అమ్మమ్మగారింటికి తీసికెళ్లాడు బాజీని. చూడగానే బాజీ కెక్కడలేని చైతన్యమూ వొచ్చింది. పోయిన్రపాణం లేచివొచ్చినట్టనిపించింది వాడికి. అమ్మమ్మ మురిసిపండయిపోయింది. బాజీని చేతుల్లోకి తీసుకుని ముద్దాడింది. బిడ్డ విపరీతంగా చిక్కిపోయాడని ఎంతో నొచ్చుకుంది. బాజీ మేనమామకి ఇద్దరు పసిపిల్లలున్నారు. పాలలో నీళ్ళు కలిసినట్టు, ఆ వాతావరణంలో మిళితంగా ఐక్యమయిపోయాడు బాజీ.

మోడువారిన చక్రవర్తి హృదయంలో మళ్లీ వసంతోదయమయింది.

బాజీ నెందుకు తీసుకొచ్చేసిందీ అక్కడెవరితోనూ చెప్పలేదు చక్రవర్తి. లోపల అవమాన భారంతో క్రుంగిపోతూ, 'బాజీ నాదగ్గర అంతగా అలవాటుపడలేదు ఎందుచేతనో'అని మాత్రమే చెప్పగలిగాడు.

తనదగ్గర వుంచెయ్యమని అమ్మమ్మ పట్టుపట్టింది. వద్దనలేకపోయాడు చక్రవర్తి.

ఇహ నక్కడ తానుండటం చాలా అనవసరమనిపించింది చక్రవర్తికి. ఎక్కడైతేనేమి, బాజీ క్షేమంగా వుండటమే తనకు కావలసింది. బాజీ సుఖంగా కాలం గడుపుతున్నందు కానందమూ, ఆ సౌఖ్యంలో ఒక్కఅణువైనా తానీయలేనందుకు బాధా, లోపల మెలివేసుకుని పీడిస్తున్నాయి. అమూల్యమైన వస్తువుని పోగొట్టుకున్న అభాగ్యుడిలా హతాశుడై పోయాడు చక్రవర్తి. తెలతెలవారుతూండగా సూట్ కేసు సర్దుకుంటూ అనుకున్నాడు, 'ఇది నాక శిక్ష; ఈ యెడబాటు తప్పదు.'

గుమ్మందగ్గర నుంచుని చూస్తున్న బాజీ క్షణమూరుకుని. 'నాన్నా దా,'అని తెలిసో, తెలియకో కవ్వించి వూరుకున్నాడు. ఆశాతరంగాలతో వుర్రూతలూగింది చక్రవర్తి హృదయం.కొన్నాళ్ళా ఆ పల్లెటూ దిక్కున ఉండిపోదామా అనుకున్నాడు. ఏమో ఎప్పటికైనా బాజీకి తనమీద మమత్వం కలక్కపోతుందా? గోవిందుమీద తను చేయిజేసుకొన్న దృశ్యం వాడి మనఃఫలకం మీదనుంచీ చెరిపేయాలనంటే కొన్నాళ్ళు పట్టవచ్చు. అది అంత సాధ్యమా?

వెళ్లిపోతే ఈ బ్రతుక్కి మళ్లీ వెలుగున్నదా? ఈ అమావాస్య చీకటి రాత్రికి శుభోదయ మయిందేమో. రమ్మని చేతులు చాచాడు చక్రవర్తి. బెదురుతూ రివ్వున ఇంటోకి పరిగెత్తుకు పోయాడు

బాజీ. ఒక్క క్షణంలో, తలెత్తిన ఆకలన్నీ నీటిబుడగలా అన్నట్టు మరుక్షణంలో టుప్పున పేలిపోయిన్నై.

వెళ్ళిపోతుంటే, వూరి చివరవరకూ బిలబిలలాడుతూ ఇరుగు పొరుగూ అందరూ వొచ్చి వుంటామన్నారు. బాజీ అమ్మమ్మ చంకలోనించి దిగి చూస్తూ నిలబడ్డాడు బొటన వేలు చీక్కుంటూ. తన జీవితంలోకి ఎలా నడిచి వొచ్చాడో అలాగే ఒక నీడలా కనుమరుగై పోతున్న ఈ విచిత్ర వ్యక్తి ఎవరనుకున్నాడో ఏమో. చక్రవర్తి వెనక్కి తిరిగి చూడనైనా చూడలేదు.

పక్కని వరిచేనిలో గుడ్లు పెట్టిన భరతపక్షి కిలికిడికిలేచి ఎగిరిపోతోంది. వూరి చివర మఠంలో కించి బైరాగి వొకడు గంజాయి తాగుతూ మధ్య మధ్య 'ఏమి జన్మంబేమి జీవనమూ' అని ఎలుగెత్తి పాడుతున్నాడు.

ఆ తరవాత తనకు మిగిలిన వొంటరి తనంలో కేన్వాస్‌మీద రచించిన మొట్టమొదటి చిత్రం ఛటర్జీకి పంపాడు చక్రవర్తి.

ప్యాకెట్టు విప్పాడు ఛటర్జీ.

చిత్రం పేరు 'కొండంత మనిషి.'

చిత్రితమయిన హిమాలయ శిఖరానికి అట్టడుగున......కరిగిన మంచు పెళ్ళలలో కొట్టుకు పోతున్న తన గుడిసెవంక చూస్తూ...ఎంతో కాదు...నలుసంత మనిషి...ఒక వృద్ధురాలు...తన పాపని చింపిరి గుడ్డలలో మూపున కట్టుకొని...బరువుగా కొండ మెట్లెక్కుతోంది.

ఛటర్జీ ముగ్ధుడై పోయాడు.

